వస్తాదు వీరన్న

శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

వీరన్న మహాబలశాలి. మంచి వస్తాదు. అలాంటి వాడిలా అవుతాడని ఎవరూ కలలో కూడా అనుకోలేదు.

ఆరోజు ఎప్పటిలాగే తెల్లవారు జామున కోడి కూసే వేళ లేచి చెరువుకు పోయి, మొహం కడుక్కొని తాలింఖానాకు పోయాడు. కసరత్తు చేయడానికీ, కుస్తీలు పట్టడం అభ్యాసం చేయడానికీ ఓ పదిమంది చేరుతారక్కడ ప్రతిరోజూ. వారందరికీ, చిన్నవాడైనప్పటికీ వృద్ధిలోనికి వచ్చినవాడు కాబట్టి వీరయ్య అంటే గౌరవం. ఆసీమలో కల్లా ఊరు పేరూ వున్నవాడు కదా మరి. ఆ చుట్టుపట్ల వున్న నాలుగైదు పట్టణాలకూ పోయి ఎవడైనాసరే కుస్తీకి రమ్మని, నూట పదహార్లు పందెం వేసి, బస్తీమే సవాల్ చేశాడు వీరయ్య. ఆయావూళ్లలోని వస్తాదులందరినీ చిత్తుచేసి, మెడలో పూలదండలతో భీమసేనుడిలా తిరిగివచ్చాడు. చాలమంది పంజాబీ ఫయిల్వానులను కూడా చిత్తుచేసి, తన పేరు వారికి కలకాలం జ్ఞాపకముండేటట్లు చేశాడు.

వీరన్న ఒడ్డూ పొడవూ వున్న మనిషి. కసరత్తువల్ల కండలు తిరిగిన శరీరం. తివాసీగుండు. చిన్నప్పుడు జబ్బుచేస్తే, కుట్టికంటికీ చెవికీ మధ్య, నిలువునా, తిరిగిన దొండకాయ ముక్కంత, వాతపెట్టిన మచ్చ. మెడలో ఆంజనేయుడి బిళ్ల, జబ్బకు బంగారు తావీజు ఎండలో నిగనిగ మెరిసేవి. లంగోటి బిగించికట్టి, ఒంటికి ఎర్రమట్టి మన్ను రాసుకుని, గురువు పాదాలకు దండం పెట్టి, నోట్లో పళ్లమధ్య నిమ్మకాయ కొరుకుతూ, తొడచరిచి కుస్తీకి తలబడితే ఎగుటివాడి గుండెలు భయంతో గడగడ వణికేవి. చూసేవారిలో ఉద్రేకం ఉప్పొంగేది.

అలాంటి వీరయ్య ఇలా అవుతాడని ఎవరూ కలలోకూడా అనుకోలేదు.

చెరువులో స్నానంచేసి, మల్లుపంచ కట్టి, మల్లు చొక్కా వేసుకుని, పావంచాల మీదికి వచ్చి బీడీ వెలిగించాడు. బట్టలుతుక్కోడానికీ, స్నానాలుచేయడానికీ చెరువుగట్టుకు వచ్చిన ఆడంగులు వీరన్నను చూసి, ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు. "ఏటి ఈరన్నా ఎక్కడికేటి యీ ముస్తాబు, ఏటి ఇసేసం" అన్నారు పల్లెపడుచులు.

"నెల్లిమరలలో అమ్మోరిసంబరం చూదాం రమ్మంటున్నాడు ఎంకయ్యాబావ. కరుసు ఆడిదేలే" అన్నాడు వీరన్న బీడీపొగ వదులుతూ.

"నేకపోతే నువ్వెడతావేటి, పిల్లికి బిచ్చం పెట్టవు నువ్వూ" అంది గొల్లపిల్ల నరిసి.

"ఓసి, ఊరుకోయే పిన్నమ్మా నా సంగతి నీకేటెరిక" అని పక్కనున్న బిందెను కాలుతో తోశాడు. బిందె చప్పుడు చేసుకుంటూ రెండు పావంచాలు దొర్లింది. వీరన్న "హి, హి, హి" అని నవ్వేడు.

"ఎటిరోరయ్యా ఆ పోగాలం, బాదంపప్పుతిని కసరత్తుసేత్తే ఒళ్లు కొవ్వెక్కినట్టుంది." అంది నరిసి.

"ఆడోళ్లు నీళ్లోసుకుంటారు, నువ్వేటికక్కడ, పో అవతలికి" అంది ఇంకో పిల్ల.

వీరన్న నవ్వుకుంటూ, వెళ్లిపోయాడు. వెంకయ్యతో కలిసి నెల్లిమర్ల సంబరానికి వెళ్లేడు. వెంకయ్య, వీరన్న స్నేహితుడు. వెంకయ్యకూ, వీరన్నకూ నేస్తం ఎలా కుదిరిందో అందరికీ ఆశ్చర్యమే ఏ విధంగానూ యిద్దరికీ పోలికలేదు. వీరన్న వస్తాదు. వెంకన్న సన్నగా పొడుగ్గా ములంకాడలా వుంటాడు. వీరన్న మొద్దువాడిలా కనిపిస్తాడు. వెంకయ్య తెలివైనవాడిలా మాట్లాడుతాడు. అసలు రామమందిరంలో భజనకు వెళ్లినప్పుడు కలిసింది వీరిద్దరికి నేస్తం. వీరన్న పాడితే, వెంకయ్య డోలకు వాయించేవాడు.

సంబరం చూసుకుని యింటికి తిరిగి బయలుదేరే సరికి చీకటిపడింది. ఊరు పొలిమేరల కొచ్చేసరికి రాత్రి పదిగంటలవుతుంది. వెంకయ్య అలసిపోయాడు. ఊరుబయట పాడుపడిన దేవాలయం మెట్లమీద చతికిలబడ్డాడు.

"ఏం వెంకయ్యా, రెండు కోసులదూరం నడిచేసరికే అలిసిపోనావేట్రా. ఇలాగైతే ఎలా బతుకుతావేశ్" అన్నాడు వీరన్న.

"ఒంట్లో బలం లేదు ఏటి చెయ్యమంటావు. అయినా బతకడానికి బలమే ఉండాలేటి, ఎర్రిగాని" అంటూ వెంకయ్యా మెట్లమీద నడుం వాల్చేడు. ఇద్దరూ బీడీలు వెలిగించారు.

ఆ కారుచీకట్లో వాళ్ల బీడీనిప్పులు తప్ప మరేం కనబడడం లేదు. అమావాస్య రాత్రిళ్లు. వెనకను పాడుపడిన కోనేలచుట్టూ అడవి బలిసింది. ఆ నిశ్శబ్దంలో కీమరాళ్ల శబ్దంమాత్రం వినిపిస్తూంది. దూరాన ఊరిలో ఒకటి రెండు దీపాలు మాత్రం మినుకు, మినుకుమంటున్నాయి.

వీరన్న ఆలోచిస్తున్నాడు. ఒక్క బలం ఉన్నంత మాత్రాన అంతా సిద్ధించినట్టేనా? మనిషికి బలం ఒక్కటే కాదు కావలసింది. మావటివాడికి ఏం బలముందని ఏనుగను లొంగ దీసుకున్నాడు. పీర్ల పండుగ నాడు సాయిబు అగ్గిలోంచి నడుస్తాడు. వాడికేం బలముందని?

అవును వెంకయ్యా చెప్పింది నిజమే. వెంకయ్యా తెలివైనవాడు. "ఎంకయ్యా" అని పిలిచేడు. వెంకయ్యా నిద్రపోతున్నాడు. అలసివున్నాడేమో కునుకు పట్టింది.

"ఏం ఈరన్నా, పోదామా" అన్నాడు వెంకయ్యా కొంచెం ఒత్తిగిలి.

"దప్పికగా వుంది. ఇక్కడెక్కడేనా నీరుందిరా" అన్నాడు వీరన్న.

"వెనక ఉడిపక్క నేనుయ్యివుందిరా. అక్కడే బాల్చీకూడా వుంటుంది నూడు"

వీరన్న నూతిదగ్గర కెళ్లేడు. ఎగురుగుండా దూరాన మైదానం కనిపిస్తూంది. నల్లటి కంబళికి కన్నాలుపడినట్లు చుక్కలు మినుకు మినుకు మంటున్నాయి. గాలిచలనం లేదు. చీకట్లు జిమ్ముమంటూ చెట్లమీద ముసురుతున్నాయి. దూరాన ఈతచెట్లు తల విరబోసుకున్న దెయ్యాల్లాగున్నాయి. కీమరాళ్ల శబ్దం శరీరమంతటికీ తాకుతున్నట్టనిపించింది. దూరాన మైదానంలో ఏదోమంట, మంటవెలుగులో తెల్ల చీర కట్టుకున్న ఒక స్త్రీ నడిచివెళ్లినట్లు అనిపించింది.

వీరన్న జాగ్రత్తగా తేరిపారజూశాడు. అబ్బే, అది స్త్రీ కాదు. ఏదో ఆవుఅయివుంటుంది, అనుకున్నాడు. తన కాళ్లలోంచి ఏదో పరుగెట్టినట్టయింది. తృళ్లిపడ్డాడు. ఏదో కిచకిచమని అరిచింది, "ఛెయ్! ఎవరక్కడ!" అని కేక వేశాడు. అగ్గిపుల్లతీసి వెలిగించి చూశాడు. నూతిగట్టునుంచి ఉడత అటు పరుగెట్టింది. వీరన్నకు దాహం పోయింది. తిరిగి వచ్చేశాడు.

"ఎవరురా అది ఈరన్నా, ఏటి కేకేస్తున్నావ్" అన్నాడు వెంకయ్యా లేచి కూర్చొని.

"ఎవరూ నేదేశ్, ఉడత పిల్ల కాళ్లలో పడింది".

"ఈరన్నా, ఎంత పిరికోడివిరా నువ్వు"

"ఛ! నాకు భయమేటిరా!"

ఇద్దరూ లేచి, బీడీలు వెలిగించి ఊరువేపుకు నడక ప్రారంభించారు. ఆ నిశ్శబ్దం వీరన్నకు నచ్చలేదు.

"ఎంకయ్యా, మంచికునుకు తీసేశావ్"

"నేదురా, కొద్దిగా కళ్లిమూశా. ఇప్పుడెంత రేతిరి అవుతుందో గాని మహాచీకటిగా వుంది. దారే సమంగా అనకుండా వుందేశ్"

దూరాన్న మైదానంలో ఇందాకటి మంట యింకా మండుతానేవుంది. "ఏటెరా ఆ మంట, ఎంకయ్యా" అన్నాడు వీరయ్యా. "ఏది, అదా? శ్మశానం గదరా అది. ఎవర్నో తగలెడుతున్నారు గాబోలు."

"దీని తస్సాదియ్యా, ఎంతసేపు మండుతూందిరా" వీరన్నకు భయం వేసిందని వెంకయ్యా గ్రహించాడు తాను బలశాలినని గర్వంతో విర్రవీగే ఘయిల్మాను ఇంత పిరికివాడని తానింతకాలం ఊహించలేదు. చిరుతపులిలా మనుషులమీదికి ఉరికే వీరన్న అకారణంగా చెట్టునూ, పుట్టనూ చూసి జడుస్తున్నాడు. వీరన్నను ఇంకా భయపెట్టాలనిపించింది వెంకయ్యాకు.

"ఈరన్నా రాత్రేళ చీకట్లో నువ్వెటేపు రానేదేటి? ఇక్కడట్టే భయం నేదు గాని ఆ తోట దాటి ఎల్లడం మంచిది కాదు. శ్మశానంగదరా. దెయ్యాలు తెగ తిరుగుతాయి. మనిషి ఒంటరిగా దొరికినాడంటే పీక్కతినేస్తాయి. కోమటోళ్ల పిల్ల సచ్చిపోయింది గదా. అది దెయ్యమయింది. ఆ దారంటెవడేనా ఎల్లితే ఎనకనుంచి పంచకొంగు పట్టుకు లాగుతాది" అని వెంకయ్యా, వీరన్న మొహం చూశాడు.

వస్తాదు వీరన్న

వీరన్న మొహంలో భయం కనిపించింది. ఆ మానవాతీతమయిన శక్తి స్వరూపం ఎలా వుంటుందో ఊహించుకోడానికి ప్రయత్నిస్తున్నాడు వీరన్న.

"ఎలాగుంటుందిరా దెయ్యం?" అని అడిగేడు.

"నువ్వు సూడలేదేటి ఎప్పుడూ? అది నల్లగా మొహం, పెద్దపళ్లు; మహ వికారంగా వుంటుంది. తెల్లచీర కట్టుకుంటాది. రవిక ఏసుకోదు. మనం సూస్తుండగానే శరీరం ఎదిగిపోతాదొరే. కాళ్లు తాటిచెట్టులాగ, చేతులు మర్రి ఊడల్లాగ ఎదిగిపోతాయి. మనిషి ననకాతలే చేతులూపుకు నడుస్తాది. భయంకరంగా నవ్వుతాది, ఏడుస్తాది." వెంకయ్యకు మరి యింతకంటె భయంకరంగా వర్ణించడం చాతనయింది కాదు.

"అయితే అది మనుషుల్నేటి సెయ్యదా?" అని వీరన్న అడిగేడు. వెంకయ్యకు నవ్వొచ్చింది. అది విజయగర్వంతో కూడిన నవ్వు. ఆ ప్రశ్నతోనే వీరన్న మనస్సులో వున్న భయాన్ని అర్థం చేసుకున్నాడు వెంకయ్య. నవ్వు అణచుకుని, "మనం దండం పెట్టి ఆంజనేయదండకం సదువుకుంటే ఏం చెయ్యదు. మాయమైపోతాది. ఏమాత్రమైనా జడిసినామా అంటే పీక పట్టుకుని నులు పేసి, తినేస్తాది. దెయ్యముంటే మరేటి!" అన్నాడు అదొక సామాన్యమైన విషయం లాగ. వీరన్నను బాగా భయ పెట్టగలిగినందుకు తనలో తాను సంతోషించాడు.

చీకట్లో కుక్కలు మొరుగుతున్నాయి. కాబట్టి ఊళ్ళోకి వచ్చినట్లు జ్ఞాపకమొచ్చింది వీరన్నకు. ఊళ్ళో అంతా నిద్రపోతున్నారు. వీరన్న వెంకయ్య ఎవరిమానాన వారు పోయి పడుకున్నారు.

తెల్లవారేక ఊళ్ళో నలుగురూ యీ మాటే అనుకుంటున్నారు. వీరన్నకు నిన్నరాత్రి పాడుపడ్డ కోవిలదగ్గర దెయ్యం కనిపించిందనీ, వాడి బట్టపట్టుకు లాగిందనీ, శ్మశానంలోంచి దెయ్యాలు రాళ్ళు రువ్వేయనీ, దానితో వీరన్న జడుసుకున్నాడనీ, యిలా చిలవలు పలవలు కల్పించి చిత్ర విచిత్రంగా చెప్పడం మొదలెట్టేరు. కనబడిన ప్రతీవాడూ "ఏం జరిగింది ఈరన్నా" అని అడగడమే. బాగా పరిచయమున్న మిత్రులు "ఓస్ ఇంతేనట్రా వీరన్నా నీ ధైర్యం! ఒంట్లో ఊపిరి నేకపోయినా నీకంటే ఎంకయ్యే నయం" అని వేళాకోళం చేశారు. చెరువుగట్టున పల్లెపడుచులు వీరన్నను చూసి వేళాకోళం మొదలుపెట్టేరు. "ఏటి రోరన్నా, శరీరం పెంచగానే సరా చెప్పు" అని ఒక అమ్మి అంటే "ఆడోళ్ళకాడ పెద్దకబుర్లు సెప్పడమేటి, గుండెధైర్యముండాల" అని ఇంకో అమ్మి హాస్యమాడింది. వీరన్న స్వతహాగా గర్విష్ఠి. ఇది తనకెంతో అవమానకరంగా వుంది. వెంకయ్య తెల్లవారేసరికి ఊరంతా యీ పుకారు లేవదీసివుంటాడు. ఆడంగుల దృష్టిలో కూడా తను అపహాస్యంపాలయాడు. ఎంత తలవంపు! తన ప్రతిష్ఠకు ఎంత దెబ్బ! దీనిని వెంటనే ఎదుర్కొనితీరాలి, అనుకుని వీరన్న ఛాతీ విరుచుకుని వీధిలో నడక ప్రారంభించాడు.

ఊరు నడిబొడ్డులోవున్న వేపచెట్టు క్రిందికి వచ్చాడు. అక్కడున్న బండరాయిమీద వెంకయ్య, మరికొందరు మిత్రులు వేపపుల్లలతో పళ్ళుతోముకుంటూ, లోకాభిరామాయణం చర్చిస్తున్నారు. వారంతా వీరన్నను పలకరించారు.

"రారా ఈరయ్యా, కూరుసో."

"నే నేదో పిరికివాడిననీ, రాతిరి జడిసిపోనాననీ యీ ఎంకయ్య ఇచూల ఊరంతా సాటినాడు. దాని సంగతేదో ఇప్పుడే తేలిపోవాల" అన్నాడు వీరన్న.

"నేనేం సాటలేదు. ఒకరిద్దరు మనోళ్ళలో మాటవోరసకి అన్నాను." అన్నాడు వెంకయ్య.

"అదే అబద్ధం చెప్పినావు. నేను జడిసినానా? వహ్! మహ ధైర్యవంతుడిలాగ వొచ్చి చెప్పేసినాడంట."

"అబద్దం కాదురా నాయనా, నిజంగా నీకు భయమేసిందా లేదా సెప్పు? ఆమాటకొస్తే నీకంటె నేను ధైర్యవంతుడినే" అన్నాడు వెంకయ్య.

"ఓరి, సాలు ఊరుకోరా—బయలుదేరినారు మొనగాళ్ళు. ఎల్లరా ఈరన్నా ఆడితో నేటి"—అక్కడున్నవారంతా దీనిని సర్దుబాటు చేయడానికి చూశారు. ఇదిగాని మితిమీరితే తీవ్రంగా పరిణమిస్తుందని వారి భయం. ఎందుచేతనంటే వీరన్న మోటవాడు. వెంకయ్య మొండివాడు.

వీరన్నకు ఒళ్ళుమండింది! "గొప్ప ధైర్యవంతుడివంటున్నావే—ఏది చూపించరా నీ ధైర్యం, అదేమాత్రమో నేను సూత్తాను," అన్నాడు.

"ఒరే, ఊరుకోమనున్న కోవిలతోటలో సక్కని మనిసుండగా జడిసినోడివి నీకు నాతో పంతమేటిరా?

నీ ఎర్రిగాని. జబ్బబలం వేరు, గుండె బలం వేరురా నాయనా!"

"అదే నూత్తాను. ఇదిగో ఒంఏరూపాయలు. పందెమేద్దాం."

"సరే అయితే, మాట తప్పకూడదు సుమా" అన్నాడు వెంకయ్య. చీకట్లో అర్ధరాత్రిప్పుడు శ్మశానంలో కెళ్ళి అక్కడ కూర్చొని ఒక మేకు భూమిలోకి కొట్టి రావాలి, అదీ పందెం. ఎవడు అలా వెళ్ళి రాలేకపోతే వాడు ఓడిపోయినట్టు. అవేళ రాత్రే పందెం. ఈ వార్త ఊరంతా తెలిసిపోయి గొప్ప ఆసక్తి రేకెత్తించింది. అంతా పందెం గురించే మాట్లాడుతూ వుండేవారు. వీరన్న గెలుస్తాడని ఒకడంటే, వెంకయ్య గెలవగలడని ఒకడు. ఎవడికి తోచినట్టు వాడు ఊహాగానం చేశాడు.

ఆ రోజంతా వీరన్న దీనినిగురించి ఆలోచించాడు. తను ఇంతకు మునుపు అనేకమందితో పెద్ద పెద్ద కుస్తీలు పట్టేడు.

ఎప్పుడూ యింత ఆలోచించలేదు. దీనిని గూర్చి యింత ఆలోచించడానికేముందో తనకర్థం కాలేదు. పగటివేళ అనేకసార్లు తనా శ్మశానంగుండా నడిచి వెళ్ళేడు. అక్కడ భయపడడానికి ఏమీ లేదు. ఆ మాత్రానికి రాత్రి వేళ మాత్రం భయమేమిటి? ముక్కు చివర ఊపిరితో బతికే వెంకయ్య వెళ్ళగా లేనిది తనేనేమిటి వెళ్ళలేడు. అదేదో చూదాం అనుకున్నాడు వీరన్న. అయితే వెంకయ్య యీ విషయం గురించి ఆలోచించనేలేదు. రాత్రి నలుగురూ వచ్చి పందేనికి రమ్మని పిలిచేవరకూ ఆ సంగతే జ్ఞాపకం లేదు.

అంతా కలిసి పాడుపడిన కోవెలతోటలోకి వెళ్ళి కూర్చున్నారు. అక్కడనుండి కొంచెం దూరాన వున్న శ్మశానంలోకి ముందు వెంకయ్య, తరువాత వీరన్న వెళ్ళి రావడానికి ఏర్పాటయింది.

అమావాస్య రాత్రి. అంతటా చిక్కటి చీకటి దట్టంగా కమ్ముకుని వుంది. ఆకాశంలో మేఘాలు కమ్ముకుని వుండడంవల్ల నక్షత్రాలు కూడా లేవు. గాలి కదలడం లేదు. వీరన్న మాటాడకుండా నిశ్శబ్దంగా కూర్చున్నాడు.

వెంకయ్య మేకు, సుత్తి పట్టుకుని మైదానంలోకి నడిచి వెళ్ళేడు. ఒకరిద్దరు కొంత దూరం వరకూ వాడి వెంట వెళ్ళి ఆగిపోయారు. ఓ పది నిముషాలయేక, నిర్ణీత స్థలంలో నేలను మేకు కొట్టి వెంకయ్య తిరిగి వచ్చాడు. తరవాత వీరన్న బయలుదేరేడు.

వీరన్న ఆ వేళ మల్లుపంచ కట్టేడు. మల్లు చొక్కా వేసుకున్నాడు. ఒక చేతిలో మేకూ, ఒక చేతిలో సుత్తీ పట్టుకు బయలుదేరేడు.

మైదానంలో నల్లటి చీకటి తప్ప మరేం కనపడడంలేదు. ఆ మైదానం ఊపిరి తీయని శవంలా నిశ్శబ్దంగా పడుకుని వున్నట్టుంది. అక్కడక్కడ ఈత తుప్పలు శవం ప్రక్క తల విరబోసుకుని కూర్చున్న ఆడవాళ్ళలా, ఏడుస్తున్నట్టున్నాయి. గాలి చలనంలేక ఒక ఆకైనా కదలక, జీవితం కదలని ఒక పెద్ద కొండలా స్తబ్దంగా పడి వున్నట్టుంది. అతనికి తన శరీరం చాలా బరువుగా వున్నట్టనిపించింది. ఆ నిశ్శబ్దంలో దూరాన గుమ్మలగొండి పకిలించింది. అది చేసిన శబ్దం చీకట్లను చీల్చుకుని తన శరీరమంతా తాకినట్లయింది. "పాడు జంతువు; మహా భయపెడుతుంది" అనుకున్నాడు వీరన్న.

దూరాన తాటిచెట్లమధ్య నిప్పులు రాలుతున్నట్లు కనిపించింది. జేబులోంచి కాగితపు పొట్లంతీసి, అందులోని ఆంజనేయస్వామి సిందూరం బొట్టు పెట్టుకున్నాడు. తన చేతివేళ్లు వణుకుతున్నట్టు గ్రహించాడు వీరన్న.

అనుకున్నచోటికి వెళ్ళి, మేకు నేలను పెట్టి సుత్తితో కొట్టేడు. తనగుండెలు దడదడ కొట్టుకుంటున్నట్టు తెలుసుకున్నాడు. మొత్తంమీద అనుకున్న పని అయిపోయింది. వీరన్న పెద్ద నిట్టూర్పు తీసి, చటుక్కున వెనక్కు తిరిగి ఒక అడుగువేశాడు. వెనక నుంచి ఎవరో తన పంచెకొంగు పట్టుకు లాగేరు. ఎవరో నవ్వినట్టయింది. మరొక అడుగు ముందుకు వేయబోయాడు వీరన్న. వెనుక పంచ చిరిగిన శబ్దమయింది. అంతే, వీరన్న నిలువునా పడిపోయాడు.

చాలాసేపు చూసి ఎప్పటికీ రాకపోతే కాగడా వెలిగించుకుని చూడడానికి వెళ్ళేరు అంతా. భయిల్మాను వీరన్న చచ్చిపోయాడు. అతని పంచ కొంగు మీద మేకు కొట్టివుంది. కేసు పోలీసుల పరమైంది.